కఠిన చట్టాలు తేవాలి



కోల్‌కతాలో డాక్టర్‌పై హత్యాచారం జరిగిన నేపథ్యంలో కఠిన చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఉంది. రాత్రి డ్యూటీలు, పని ప్రదేశాల్లో రక్షణకు తగిన చట్టాలు తీసుకురావాలి. నిందితులను కఠినంగా శిక్షించినప్పుడే దాడులకు పాల్పడేందుకు మరొకరు భయపడతారు. అప్పుడే మహిళలపై దాడులను అరికట్టేందుకు వీలవుతోంది. ఆ దిశగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. ఆసుపత్రిలో భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలి.

–పి.పుష్ప, కమ్యూనిటీ హెల్త్ సెంటర్, కొండముది

దారుణాలు ఇక సహించలేం



మహిళలకు ఎక్కడుంది స్వాతంత్య్రం అనిపిస్తోంది. రాత్రి డ్యూటీలు చేసే మహిళలకు రక్షణ లేదు. 8 గంటల పనివేళలు డాక్టర్లకు ఎందుకు లేవు. 36 గంటల డ్యూటీలేంటి ? ఇంట్లో, పని ప్రదేశంలో విధుల్లో మానసిక ఒత్తిడికి తోడు శారీరక హింస ఏమిటి? ఇకపై సహించే పరిస్థితి లేదు. మద్యం, డ్రగ్స్ తీసుకునే దారుణాలకు పాల్పడుతున్నారు. అలాంటివారు బయటకొస్తే కఠిన శిక్షణ విధించాలి. రాత్రి డ్యూటీలు, పని ప్రదేశాల్లో రక్షణకు తగిన చట్టాలు తీసుకురావాలి.

– డాక్టర్ హిమని, రేడియాలజిస్ట్, తెనాలి

క్లుప్తంగా

మెరుగైన సేవలే లక్ష్యం

మున్సిపల్ కమిషనర్ ఎం.రమేష్‌బాబు



పొన్నూరు: పొన్నూరు పురపాలక సంఘం పరిధిలోని 31 వార్డుల ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతానని మున్సిపల్ కమిషనర్ ఎం. రమేష్‌బాబు తెలిపారు. పట్టణ నూతన కమిషనర్‌గా ఆయన గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తానని అన్నారు. ప్రధానంగా పారిశుద్ధ్య విభాగాన్ని మెరుగుపరచి, ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందిస్తానని తెలిపారు. కార్యాలయంలోని పలు శాఖల్లో అవినీతి, అక్రమాలకు తావులేకుండా బాధ్యతలు నిర్వర్తిస్తానని అన్నారు. ప్రధానంగా ప్రజారోగ్య శాఖ, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, ఇంజినీరింగ్ విభాగాలను ప్రక్షాళించే దిశగా చర్యలు చేపడతానని తెలిపారు.

రేపు సీతారామస్వామి ఆలయ ప్రతిష్ట మహోత్సవం

పొన్నూరు: మండలంలోని కసుకర్రు గ్రామంలో ఈనెల 31వ తేదీన సీతారామస్వామి నూతన ఆలయ ప్రతిష్ట మహోత్సవం, మహా కుంభాభిషేకం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం ఏడు గంటలకు గోపూజతో కార్యక్రమాలు ప్రారంభమై 8 గంటలకు గ్రామంలో నూతనంగా నిర్మించిన హనుమత్, సీతా, లక్ష్మణ, గణపతి, సుబ్రహ్మణ్య, సహిత శ్రీరామచంద్రమూర్తి ప్రతిష్ట, 12 అడుగుల అభయాంజనేయ స్వామివారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం, మహా కుంభాభిషేకం, శాంతి కల్యాణం జరుగుతుందని తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు భక్తులు పాల్గొనాలని కోరారు.

వైభవంగా స్వర్ణ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



పొన్నూరు: పట్టణంలోని సహస్ర లింగేశ్వర స్వామి దేవస్థానంలో పద్మావతి గోదాదేవి సమేత స్వర్ణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమాల్లో భాగంగా గురువారం ఉదయం స్వామివారి గరుడోత్సవం, సాయంత్రం మహాశాంతి హోమం, అనంతరం స్వామివారి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ టి.శ్రీనివాస్ పర్యవేక్షించారు.

పోలేరమ్మకు హుండీ ఆదాయం రూ.13.31 లక్షలు



కొండపాటూరు(కాకుమాను): మండలంలోని కొండపాటూరులో వేంచేసి ఉన్న స్వయంభు కొండపాటూరు పోలేరమ్మ ఆలయ హుండీ లెక్కింపు కార్యక్రమం గురువారం జరిగింది. బాపట్ల దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వి.శ్యామల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈవో బత్తుల సురేష్ మాట్లాడుతూ.. గత మూడున్నర నెలలుగా భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.13.31 లక్షలు వచ్చినట్లు తెలిపారు. పూజారి మువ్వా రామచంద్రయ్య, సర్పంచి యర్రాకుల దానయ్య, పొన్నం శ్రీనివాసరావు, తోట నరేంద్ర, మండల రవి, కాకా సాంబయ్య, ఎస్‌బీఐ సిబ్బంది, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబోస్ సేవలు మరువలేనివి



నగరంపాలెం: చంద్రబోస్ సేవలు మరువలేనివి అని పలువురు వక్తలు, అధికారులు కొనియాడారు. గురువారం కాకానిరోడ్డులోని బైబిల్ కళాశాల ఎదురు ప్రాంగణంలో గురువారం రెవ.డాక్టర్ పీఎస్‌ఎస్.చంద్రబోస్ 75వ జయంతి వేడుకలు జరిగాయి. ఎమ్మెల్యే గల్లా మాధవి, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి తాడిశెట్టి మురళీమోహన్, మాజీ డీజీపీ స్వరణ్ జిత్‌సేన్, సీనియర్ ఐఏఎస్‌లు కాంతిలాల్ దండే, కోన శశిధర్, బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు లీలాబోస్ తదితరులు హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో గాస్పెల్ మిషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి జీవన్, అన్నంరాజు సాయిరాం, డాక్టర్ రాగ దీపిక, బైబిల్ కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొని చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

లక్ష్మీపురం: గుర్తుతెలియని వ్యక్తి గోల్కొండ ఎక్స్‌ప్రెస్ రైలు నుండి ప్రమాదవశాత్తు జారి పడడంతో రైల్వే పోలీసులు జీజీహెచ్‌కు తరలించినట్లు జీఆర్‌పీ సీఐ అంజిబాబు గురువారం తెలిపారు.

మధురమైన భాష తెలుగు



గిడుగు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంఈవో రమాదేవి తదితరులు



సంప్రదాయ వస్త్రధారణలో అధ్యాపకులు, విద్యార్థులు

ప్రత్తిపాడు: తెలుగు భాష తేనెలొలుకు మధురమైన భాష అని మండల విద్యాశాఖాధికారి సీహెచ్ రమాదేవి అన్నారు. మండల పరిధిలోని తిక్కిరెడ్డిపాలెం ఎల్ఈ ప్రాథమిక పాఠశాలలో గురువారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఈవో హాజరయ్యారు. గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. తెలుగు భాష గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. దీనిని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రత్నారావు, ఉపాధ్యాయుడు వెంకట్రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాతృభాషను ఎన్నటికీ మరువరాదు

గుంటూరు రూరల్: మాతృభాష తెలుగును ఎవ్వరూ మరువరాదని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ప్రిన్సిపల్ రెవరెండ్ సిస్టర్ సంధ్య తెలిపారు. గురువారం గోరంట్ల గ్రామంలోని కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా అధ్యాపకులు, విద్యార్థినులు సంప్రదాయ వస్త్రధారణలో ఆకట్టుకున్నారు. విద్యార్థినుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. వైస్ ప్రిన్సిపల్ ఆర్ షారోన్‌రోజ్, ఆర్ ఫణిరాజ్యలక్ష్మి, ఐ ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల విజేతలకు బహుమతులు

కళాశాలలో జాతీయ క్రీడా దిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఆర్. షారోన్‌రోజ్, పీడీ జి.బాలశౌరిరెడ్డి, ఎన్‌సీసీ ఆఫీసర్ కె.సుస్మిత, అధ్యాపకులు తదితరులున్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



నన్నపనేని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం



ప్రత్తిపాడులో కబడ్డీ ఆడుతున్న పాఠశాల విద్యార్థులు

కాకుమాను: నేటి యువత ధ్యాన్‌చంద్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని క్రీడల్లోనూ రాణించాలని ఎంఈవో కె.ఎఫ్.కెనడీ అన్నారు. స్థానిక నన్నపనేని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వివిధ ఆటల పోటీలు పెట్టారు. విజేతలకు బహుమతులు, షీల్డ్‌లు ప్రదానం చేశారు. వ్యాయామ ఉపాధ్యాయుడు గోపి, ఉపాధ్యాయిని జవహర్ రాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: స్థానిక భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించారు. పీడీ డేవిడ్ రాజ్ కుమార్ ఆధ్వర్యంలో తరగతులవారీగా జరిగిన పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. పోటీలను మండల విద్యాశాఖాధికారులు సీహెచ్ రమాదేవి, జి. లీలారాణిలు పరిశీలించారు.

విజ్ఞాన్ నిరుల కళాశాలలో క్రీడా పోటీలు



విద్యార్థినికి బహుమతి అందిస్తున్న ప్రిన్సిపల్ రాధిక

గుంటూరు రూరల్: మండలంలోని పెదపలకలూరు గ్రామంలో ఉన్న విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ పీ రాధిక మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతోపాటు ఆటలు కూడా ఎంతో అవసరం అన్నారు. వాటి ద్వారా పోటీతత్వం, ఆరోగ్యం మెరుగు పడతాయన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, క్యారమ్స్, పరుగు, త్రోబాల్, టెన్నికాయిట్ తదితర పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. గెలిచిన వారిని కళాశాల పీడీ కిషోర్‌కుమార్, విజ్ఞాన్ విద్యాసంస్థల అధ్యక్షుడు డాక్టర్ లావు రత్తయ్య, ఉపాధ్యక్షుడు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తదితరులు అభినందించారు.

క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యం



విజేతలతో కళాశాల యాజమాన్యం తదితరులు

గుంటూరు రూరల్: క్రీడలు విద్యార్థులకు ఎంతో అవసరమని, భవిష్యత్తులో ప్రభుత్వ కొలువులు పొందేందుకు ఉపయోగపడతాయని విజయవాడ జోన్ ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ చీఫ్ జాయింట్ ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ పీ మునిస్వామి నాయుడు తెలిపారు. గురువారం చొడవరం గ్రామంలోని చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాలలో జరిగిన క్రీడా సాంస్కృతిక సంబరాల ముగింపు వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులకు క్రీడా పోటీల నిర్వహణను అభినందించారు. తెలుగు భాషా దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. ఏఎన్‌యూ రీసెర్చ్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పీ సుధాకర్ మాట్లాడుతూ క్రీడల ద్వారా విద్యార్థుల ఎదుగుదల సాధ్యపడుతుందన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విజేతలకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. విద్యాధర్ బహుమతులు అందజేశారు. రాష్ట్రస్థాయిలో జరిగిన ఈ పోటీలలో మొత్తం 20 కళాశాలల నుంచి 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలను కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస్, కార్యదర్శి ఎన్. శ్రీనివాస్, కోశాధికారి ఆర్. గోపాలకృష్ణ తదితరులు అభినందించారు.

రోడ్డుపై కూలిన భారీ చింత చెట్టు



కాకుమాను: పెదనందిపాడు మండలంలోని అబ్బినేనిగుంట పాలెం అడ్డరోడ్డు వద్ద పాత మద్రాసు రహదారిపై భారీ చింత చెట్టు నేలకొరిగింది. ఘటన జరిగిన గురువారం వేకువజామున జన సంచారం, వాహన రాకపోకలు అంతగా లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సుమారు గంటపాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న పెదనందిపాడు ఎస్ఐ రాజ్ కుమార్ తన సిబ్బందితో వచ్చారు. జేసీబీ సహాయంతో చెట్టును తొలగింపజేయడంతో రాకపోకలు మొదలయ్యాయి.

జొన్నలగడ్డలో 'పొలం బడి'

గుంటూరు రూరల్: మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో పొలం బడి కార్యక్రమాన్ని మండల వ్యవసాయశాఖ అధికారి ఐ. సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రైతులు తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పంటల్లోని పురుగుల నుంచి సస్యరక్షణ చర్యలు, నీరు, ఎరువులు, కలుపు యాజమాన్యం గురించి వివరించారు. గ్రామ ఉపసర్పంచి నామా శ్రీనివాసరావు, అభ్యుదయ రైతు వంగా నవీన్‌రెడ్డి, సంస్కృతి విశ్వవిద్యాలయ ఉత్తరప్రదేశ్ విద్యార్థులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

హాస్యంతో మెప్పించిన నటుడు పద్మనాభం

లక్ష్మీపురం: ఆహార్యం, సంభాషణ చాతుర్యంతో హాస్య రస పోషణలో ప్రత్యేక వరవడిని సృష్టించిన పద్మనాభం తెలుగు ప్రేక్షకుల మనసులో చిరస్థాయిగా నిలిచిపోతారని సినీ రంగ విశ్లేషకులు అసోసియేటెడ్ డైరెక్టర్ కనగాల జయకుమార్ అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం సినీ హాస్యనటుడు పద్మనాభం జయంతి కార్యక్రమం జరిగింది. ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాలలతో నివాళులర్పించారు. నలుపు తెలుగు సినిమాల కాలం నుంచి కలర్ ఫుల్ డిజిటల్ సినిమాల వరకు సినీ ప్రేక్షకుడిని నవ్వుల్లో ముంచెత్తి, అప్పుడప్పుడు అక్కడక్కడ నవరసాలు రుచి చూపించిన పద్మనాభం ని తెలుగు వారెప్పుడూ మర్చిపోరన్నారు. బి.వి.రామ్ కుమార్, కొండాశివ రామిరెడ్డిలు మాట్లాడారు. అనంతరం హాస్య వల్లరి కోఆర్డినేటర్ వి.వి.రావు, గాయనీ గాయకులు రాజశేఖర్, సాయిబాబా, భాగ్యలక్ష్మి, నివాళులర్పించారు.

ఇంటింటి సర్వే సక్రమంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న డీటీ ఫణికుమార్

పొన్నూరు: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు చేపట్టిన ఓటరు జాబితా సవరణ ఇంటింటి సర్వే స్పష్టంగా నిర్వహించాలని ఎన్నికల డీటీ ఫణి కుమార్ తెలిపారు. సంబంధిత క్లైములను వెంటనే దాఖలు చేయాలని కోరారు. గురువారం తహసీల్దారు కార్యాలయంలో అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో గుర్తింపు పొందిన అన్ని రాజకీయపార్టీల ప్రతినిధులతో స్పెషల్ సమ్మరీ–2025 సంబంధించి సమావేశం నిర్వహించారు. సర్వేలో వస్తున్న అన్ని క్లెయిములకు సంబంధించి విచారణను పారదర్శకంగా నిర్వహించాలని పేర్కొన్నారు. 17,18,19 సంవత్సరాలు నిండిన యువత తప్పక ఓటు నమోదు చేయాలని తెలిపారు. ఈ వారంలో దాఖలైన అన్ని క్లెయిముల వివరాలను పార్టీల ప్రతినిధులకు అందజేశారు. సమావేశంలో అధికారులు, వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

యువతకు స్వయం ఉపాధి కల్పనే లక్ష్యం



మాట్లాడుతున్న డాక్టర్ యుగంధర్ కుమార్

గుంటూరు రూరల్: యువతకు స్వయం ఉపాధి కల్పించి అభివృద్ధి దిశగా నడిపించడమే తమ లక్ష్యమని కృషి విజ్ఞాన కేంద్రం ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ఎం. యుగంధర్ కుమార్ తెలిపారు. గురువారం నగర శివారుల్లోని లాంఫాంనందున్న కృషి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గతంలో అగ్రికల్చర్ స్కిల్ కౌన్సిల్ ద్వారా వర్మీకంపోస్టు తయారీపై శిక్షణ పొందిన అభ్యర్థులకు ఉపయోగపడేలా ఇలాంటి పలు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కోర్సు డైరెక్టర్ డాక్టర్ ఎం. గంగాదేవి మాట్లాడుతూ.. యువతను వ్యాపారానికి సిద్ధం చేయడం, ప్రణాళికలు, అవకాశాలు, వ్యక్తిత్వ వికాసం వంటివాటిపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఆర్ఏఆర్ఎస్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ఎం. రత్నం మాట్లాడుతూ వర్మీకంపోస్టు తయారీ గురించి వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ కె. జయదేవ్‌రాజన్, డాక్టర్ ఎ.అనిత, డాక్టర్ ఎం. దీప తదితరులు పాల్గొన్నారు.

బాల్యం నుంచే సమాజ సేవ నేర్వాలి



చిన్నారులతో చలపతి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు

గుంటూరు రూరల్: విద్యార్థులకు చిన్ననాటి నుంచి సమాజ సేవపై అవగాహన కల్పించాలని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. చంద్రశేఖర్ తెలిపారు. గురువారం నగర శివారులోని లాం నందున్న కళాశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ కళాశాలలోని ఐటీ హబ్ అసోసియేషన్ విద్యార్థులు సమాజ సేవలో భాగంగా నగరంలోని బ్రాడీపేటలో ఉన్న శారదానికేతన్ ఓరియంటెడ్ హైస్కూల్ విద్యార్థులకు ఆట వస్తువులు, రింగ్‌బాల్స్, స్కిప్పింగ్ రోప్స్ తదితరాలను వితరణగా అందజేశారన్నారు. సేవా గుణం చాటిన వారిని ప్రిన్సిపల్‌తోపాటు కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ వై.సుజిత్‌కుమార్ కూడా అభినందించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు జె. భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

భార్యను హత్య చేసిన భర్త అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సుబ్బారావు

పట్నంబజారు: భార్యను హత్య చేసిన కేసులో భర్తను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. పాత గుంటూరు పోలీసు స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉమెన్ పోలీసు స్టేషన్ డీఎస్పీ వి.వి.సుబ్బారావు, పాతగుంటూరు పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్ఓ వై.వీరసోమయ్య వివరాలు మీడియాకు వెల్లడించారు. ఈనెల 26వ తేదీన పాతగుంటూరు పరిధిలోని రాఘవనగర్‌లో అచ్చి అంకమ్మరావు అలియాస్ అభిరామ్ పూటుగా మద్యం సేవించితన భార్య మానికను క్రికెట్ బ్యాట్‌తో తలపై మోదడంతో గాయాలయ్యాయి. బాధితురాలిని గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఈనెల 27వ తేదీ ఉదయం మృతి చెందింది. అమరావతి మండలం కర్లపూడి గ్రామానికి చెందిన అంకమ్మరావు గత 11 సంవత్సరాల క్రితం గుంటూరు సెంట్రింగ్ పనులకు వచ్చి మణిపురం 1వలైనుకు చెందిన మానిక (24)తో పరిచయం ఏర్పడడంతో ప్రేమగా మారి వివాహం చేసుకున్నారు. మృతురాలు ఆటోనగర్‌లోని ప్లాస్టిక్ డబ్బాల కంపెనీలో పనిచేస్తుండగా, అంకమ్మరావు వాసవీ కాంప్లెక్సులోని బట్టల కొట్టులో గుమస్తాగా పనిచేస్తున్నాడు. చెడు వ్యసనాలకు బానిసగా మారి నిత్యం భార్యపై అనుమానం పడి, కులం పేరుతో దూషిస్తూ వేధింపులకు గురిచేస్తూ కొడుతుండేవాడు. ఈ క్రమంలోనే ఈనెల 26వ తేదీ రాత్రి పూటుగా మద్యం సేవించి వచ్చి భార్య మానికతో వివాదం పెట్టుకుని క్రికెట్‌బ్యాట్‌తో ఆమె తలపై మోదడంతో చికిత్స పొందుతూ మృతి చెందింది. అనంతరం నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. ఈక్రమంలో ఈనెల 28వతేదీ సాయంత్రం 6 గంటలకు ఆర్టీసీ బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న అంకమ్మరావును పోలీసులు అరెస్టు చేశారు. ఈమేరకు కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు. నిందితుడి ని పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన ఎస్సై పి.భాగ్యరాజ్, హెడ్‌కానిస్టేబుల్ కె.కోటేశ్వరరావు, నూరుద్దీన్, యోహాన్, కె.యోహాన్, అనిల్, శామ్యూల్‌రాజ్, మురళి, హనుమాన్‌సింగ్‌లను అభినందించారు.

బాల్య వివాహాలపై అవగాహన



మంగళగిరి: బాల్య వివాహాల వల్ల అనారోగ్యం, రక్తహీనత, ప్రసూతి మరణాలు సంభవిస్తాయని డాక్టర్ పి.అనూష తెలిపారు. పట్టణంలోని ఇందిరా నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో గురువారం బాల్య వివాహాల నియంత్రణపై అవగాహన కార్యక్రమంలో డాక్టర్ అనూష మాట్లాడారు. ఆడ పిల్లలు 18 సంవత్సరాల లోపు, మగపిల్లలు 21 సంవత్సరాల లోపు వివాహాలు చేసుకోరాదన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే వెంటనే అధికారులకు సమాచారమివ్వాలని కోరారు.

చట్టరీత్యా నేరం

తాడేపల్లిరూరల్ : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యులు డాక్టర్ మానస అన్నారు. . తాడేపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ మానస మాట్లాడుతూ కౌమార ఆరోగ్య దినోత్సవం సందర్భంగా బాల్య వివాహాల వల్ల కలిగే ప్రభావాలపై బాల బాలికలకు అవగాహన కల్పించామన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రతి నెలా 4వ గురువారం ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, హెల్త్ సెంటర్ వైద్యులు, సిబ్బంది, ఆశ వర్కర్లు, అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్య సమస్యలు

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, ఆరోగ్య సమస్యలపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన దుగ్గిరాల పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ సి. ఇందిర బాల్య వివాహాల అనర్థాలు, ఆరోగ్యంపై పడే ప్రభావాలను వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభాదేవి మాట్లాడుతూ బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే 1098 టోల్ ఫ్రీ నంబరుకు లేదా 100కు సమాచారం అందించాలని తెలిపారు. హెల్త్ ఎడ్యుకేటర్ వి.సుబ్బారావు, ఎంఎల్‌హెచ్‌పీ స్వాతి, ఆరోగ్య కార్యకర్తలు లీల, శ్యామల, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న ఆరోగ్యాధికారిణి డాక్టర్ హెలెన్ నిర్మల

తెనాలి అర్బన్: వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల సూచించారు. తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో చినరావూరు పార్కు వద్ద గురువారం సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల జ్వరాల సంఖ్య బాగా పెరుగుతోందన్నారు. పరిసరాల్ని శుభ్రంగా ఉంచుకుంటూ, దోమల్ని నిర్మూలించాలని తెలిపారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడి వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. ఒళ్లు నొప్పులు, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యశాలకు వెళ్లి చికిత్స చేయించుకోవాలని తెలిపారు. అనంతరం వాకర్లకు వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల్ని తెలియజేసే కరపత్రాల్ని పంపిణీ చేశారు. సమావేశంలో పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూలుకు మొక్కల పంపిణీ



తెనాలి: కేవలం బ్యాంకింగ్ కార్యకలాపాలతోనే సరిపెట్టకుండా సామాజిక బాధ్యతతో భారతీయ స్టేట్ బ్యాంక్ తెనాలి డివిజన్ పరిధిలో మొక్కల పంపిణీ చేపట్టిందని ఆ బ్యాంక్ మార్కెటింగ్ కన్సల్టెంట్ సాయి లక్కరాజు చెప్పారు. రూరల్ మండలం అంగలకుదురులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గురువారం గులాబీ,తులసి, వేప తదితర మొక్కలను అందజేశారు. బ్యాంక్ ప్రాంతీయ పరిధిలో పర్యావరణ పరిరక్షణకు మొక్కలను పంపిణీ చేస్తున్నామని ఆయన తెలిపారు. తెలుగు భాషాదినోత్సవ సందర్భంగా తమ పాఠశాలను ఎంపిక చేసుకొని మొక్కలను అందించినందులకు పాఠశాల ప్రధానోపాధ్యాయిని అనూరాధ ధన్యవాదాలు తెలిపారు. తొలుత మొక్కలను అందజేసి, కొన్ని మొక్కలను నాటారు. కార్యక్రమంలో రావినూతల ప్రకాష్, పాఠశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.